క్లుప్తంగా

మరుగుదొడ్ల నిర్మాణం పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రభాకర్‌రావు

మడకశిర: పట్టణంలోని మధుగిరి సర్కిల్ వద్ద దాదాపు రూ.15లక్షలతో ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న మరుగుదొడ్లను మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు శుక్రవారం పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించమని తెలిపారు. ఏఈ మురళి, కౌన్సిలర్ నాగేంద్ర, మాజీ కౌన్సిలర్ నారాయణప్ప ఉన్నారు.

వర్షం కోసం రామ భజనలు

పావగడ: తాలూకా వ్యాప్తంగా వర్షాలు కురవాలని కోరుతూ తాలూకాలోని శ్రీరంగపురం గ్రామానికి చెందిన రామభజన మండలి సభ్యులు శుక్రవారం పట్టణంలో రామ భజనలు చేపట్టారు. ఈ సందర్భంగా భజన మండలి అధ్యక్షుడు వెంకటేశప్ప మాట్లాడుతూ ఏటా వర్షం కోసం భజనలు చేస్తున్నామన్నారు.

సన్మానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పాండురంగ నగర్‌లోని స్థానిక లయన్స్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులు, అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మాన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ-1 గంగప్ప.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కరాటే, స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటిన 11 మంది విద్యార్థులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జ్యోతిర్మయిని సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి శ్రీనివాసులు, ట్రెజరర్ గంగాధరయ్య పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

మడకశిరరూరల్: తులసీధామ వృద్ధాశ్రమానికి శుక్రవారం కళ్యాణదుర్గంకు చెందిన విశ్రాంత హెచ్‌ఎం నాగరాజు దంపతులు రూ.40 వేల విరాళాన్ని నిర్వాహకుడు తిమ్మప్పకు అందించారు. దాతలు వృద్ధులకు పండ్లు అందజేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



పాఠశాలకు ఫస్ట్‌ఎయిడ్ కిట్స్ అందిస్తున్న దృశ్యం

హిందూపురం: బాలికలు జాగ్రత్తలతో ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదగాలని వాసవ్య మహిళా మండలి కుశాల్ విప్రోకేర్ క్లినిక్ ఆరోగ్య సిబ్బంది సూచించారు. మండలంలోని సంతేబిదనూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్ సహకారంతో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే పాఠశాల విద్యార్థినులకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందించారు. కార్యక్రమంలో కుశాల్ ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్

హిందూపురం: శ్రీసత్యసాయి జిల్లా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మేడం వరప్రసాద్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేడం వరప్రసాద్ మాట్లాడుతూ.. బీజేవైఎం, బీజేపీ కార్యవర్గంలో వివిధ కమిటీల్లో పని చేశానన్నారు. తనపై నమ్మకంతో మరోసారి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తికి గాయాలు



గాయపడిన శంకర్‌రెడ్డి

చిలమత్తూరు: మండలంలోని 544ఈ జాతీయ రహదారిపై మరవకొత్తపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలమత్తూరుకు చెందిన శంకర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం సాయంత్రం కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి చిలమత్తూరు వైపునకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి శంకర్‌రెడ్డి కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడ్ని స్థానికులు 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

గుడిబండ: 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. మండల కన్వీనర్‌తో పాటు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులుందరూ కలిసి కట్టుగా వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేసి జగనన్న రుణం తీర్చుకోవాలన్నారు. ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, మండల కన్వీనర్ డీ.ఎల్.యంజారేగౌడు, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్‌లు రంగస్వామి, సతీష్, లక్ష్మీనారాయణ, కోఆప్షన్ మెంబర్ తౌసిఫ్, నాయకులు గుప్త, క్రిష్టప్ప, తిప్పేస్వామి, రమేష్, గిరిధర్, శివరాజ్ పాల్గొన్నారు.



గుడిబండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

రొళ్ల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో పార్టీ మండలాధ్యక్షుడు నరసింహారెడ్డి అధ్యక్షతన 'ఏపీకి జగన్ సీఎం ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అనంతరాజుతో కలిసి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్లలో ఎన్నికల హామీలు 99 శాతం అమలు చేశారన్నారు. దీంతో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు ఈనెల 9 నుంచి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ బలోపేతంపై కృషి చేయాలన్నారు. నూతనంగా మండలాధ్యక్షుడిగా నియమితులైన నరసింహారెడ్డిని ఎమ్మెల్యే పూలమాలతో సన్మానించారు. జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, సర్పంచ్ సదాశివప్ప, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దొడ్డయ్య, నాగేష్‌రంగారెడ్డి, నాగేంద్ర, యర్రగుంటప్ప, ఆంజినేయులు, కాకి, ఎం.రాయాపురం, హులికుంట వైస్ సర్పంచులు రాజు, రవి, రవికుమార్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంతోష్, సన్నమారప్ప, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మడకశిర ప్రాంత అభివృద్ధికి కృషి

మడకశిరరూరల్: మడకశిర ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. కదిరేపల్లిలో కొత్త గ్రామ సచివాలయం వద్ద భూగర్భజలాలు పెంపునకు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా సచివాలయాలు, పాఠశాలల ఆవరణాల్లో ప్రతి వర్షపు నీటి బొట్టును నిల్వ చేసి భూమిలోకి ఇంకించేందు గుంతలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మడకశిర మండలంలో దాదాపు 10 చెరువులను కృష్ణాజలాలతో నింపి మరువలు పారించడంతోనే బోరు బావుల్లో నీటి మట్టం పెరిగిందన్నారు. అమరాపురం, గుడిబండ మండలాల్లోని చెరువుల్లో కృష్ణాజలాలు నింపి దానికి చర్యలు చేపట్టామని తెలిపారు.

ఈ-కేవైసీ వేగవంతం చేయండి



ఈ-కేవైసీ చేయించుకుంటున్న రైతులు

రొళ్ల: మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో పంట నమోదు చేయించిన రైతులతో ఈ-కేవైసీ వేగవంతం చేయాలని ఏఓ రాజ్యలక్ష్మి కోరారు. శుక్రవారం బీజీహళ్లి, హొట్టేబెట్ట రైతు భరోసా కేంద్రాల ఆవరణలో వీఏఏలు, వీహెచ్‌ఏలు చేపట్టిన ఈ-కేవైసీ నమోదును పర్యవేక్షించారు. ఏఓ మాట్లాడుతూ ఈ-కేవైసీ చేయించకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం అందదన్నారు. కార్యక్రమంలో వీఏఏ ప్రసన్నకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

లేపాక్షి: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు 'వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్ కార్యక్రమం'పై సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎస్.దీపిక హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి





రొద్దంలో సమావేశానికి హాజరైన జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, సోమందేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సోమందేపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వర కల్యాణ మంటపంలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి నవంబరు 11 వరకు ఆంధ్రకు జగనే కావాలి అనే కార్యక్రమం విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ కమిటీ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి కార్యక్రమం గురించి వివరించాలని చెప్పారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో అన్ని వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకొస్తేనే ప్రభుత్వ పథకాలు అముల అవుతాయని, స్కామ్‌లు చేసి జైలుకు వెళ్లిన చంద్రబాబును నమ్మితే ఏపీని అమ్మేస్తారని అన్నారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకొని పార్టీ మండల కన్వీనర్‌తో పాటు ముఖ్య నాయకులు పల్లెనిద్ర చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి నోరు అదపులో పెట్టుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి పార్థసారథికి లేదన్నారు. అక్రమాలకు పాల్పడి జైలుకు వెళ్లిన టీడీపీ నాయకులు తమ పార్టీని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే టికెట్ కోసం ఆ పార్టీలో పార్థసారథి, సవితల మధ్య పోరు జరుగుతోందన్నారు. ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకొని అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, కోఆప్షన్ సభ్యుడు రమేష్, మండల సచివాలయ కన్వీనర్ ఇమామ్ వలి పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి..

రొద్దం: సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందాలంటే రాబోవు ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్నే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమంపై జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితర నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హుతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. త్వరలో పల్లెనిద్ర కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజా ప్రతినిధులు, సచివాయల కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు పల్లెనిద్రలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేసిన పథకాలను వివరించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఎంపీపీ చంద్రశేఖర్, ఎంపీటీసీ మాధవి, సర్పంచ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవి శేఖర్‌రెడ్డి, కలిపి సింగిల్ విండో చైర్మన్, శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి, ఎస్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష శిబిరం పరిశీలన: తురకలాపట్నం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. గౌరాజుపల్లికి చెందిన మాజీ డీలర్, నాయకుడు సుధాకర్‌రెడ్డిని పరామర్శించారు.

సమష్టి కృషితోనే గెలుపు సాధ్యం



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక

చిలమత్తూరు: సమష్టి కృషితోనే రాబోవు ఎన్నికల్లో టీడీపీని నియోజకవర్గంలో చిత్తు చేయగలమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'పై సన్నాహక సమావేశం జరిగింది. వలంటీర్లు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సీఎం జగన్ ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చేయని పనులను చెప్పుకునే ఉద్దేశం మనకు లేదని, చేసిన మేలును ప్రతి ఇంటికీ చేరవేస్తే చాలని స్పష్టం చేశారు. ఈనెల 11 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను సచివాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శించాలన్నారు. రోజూ కనీసం గంట పాటు ప్రజలతో మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పథకాల లబ్ధిని ఇంటింటికీ తిరుగుతూ వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమ రెడ్డి,పార్టీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు సంధ్య, తిరుమలేష్, మురళి, ఎంపీటీసీలు మంజునాథ్‌రెడ్డి, ఆదినారాయణ, సింగిల్‌విండో చైర్మెన్లు హనుమంతరెడ్డి, దివాకర్ రెడ్డి, అమరనాథ్, సీనియర్ నాయకులు రాజారెడ్డి, మాజీ కన్వీనర్ సదాశివరెడ్డి, షాకీర్, అయూబ్, అశ్వర్థరెడ్డి, హరి, నవాబ్ పాల్గొన్నారు.

రాత్రి పూట సమావేశం.. మతలబేమిటో?

హిందూపురం టౌన్: ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేటు అసోసియేషన్‌కు చెందిన వ్యక్తులు రాత్రి సమావేశమవ్వడం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఔషధ నియంత్రణ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అధికారులు ఎవరూ లేకపోయినప్పటికీ మెడికల్ అసోసియేషన్ సభ్యులు సమావేశమయ్యారు. ఓ ప్రభుత్వ కార్యాలయంలో సమయం కానీ సమయంలో ప్రైవేటు వ్యక్తులు దర్జాగా సమావేశం నిర్వహించడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయమా.. లేక ప్రైవేటు మెడికల్ అసోసియేషన్ కార్యాలయమా? ఈ సమావేశం వెనుక మతలబేమిటో అని ప్రశ్నిస్తున్నారు.



ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయంలో సమావేశమైన ప్రైవేటు మెడికల్ అసోసియేషన్ సభ్యులు

సమావేశంలో పట్టణంలోని ఓ మెడికల్ షాపులో తక్కువ ధరలకే మందులు అందిస్తుండటంపై చర్చించారని సమాచారం. ఈ విషయంపై ఔషధ నియంత్రణ అధికారి హనుమన్నను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

కంటి చూపుతో ప్రపంచాన్ని జయించొచ్చు

పరిగి: కంటి చూపుతో ప్రపంచాన్ని జయించవచ్చని కొడిగెనహళ్లి ఏపీఆర్ గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌ఎస్‌లో ఉచిత కంటి పొర వైద్య పరీక్షలు, ఉచిత శస్త్ర చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ఏపీఆర్‌ఎస్‌లో 1992 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఎన్‌ఆర్‌ఐ ఆనంద్ దాసరి ఆర్థిక సౌజన్యంతో ఉచిత కంటి వైద్య, శస్త్ర చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వందలాది మంది తొలి రోజు కంటి వైద్య పరీక్షలకు హాజరయ్యారు. జన్ సంకల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆనంద్ దాసరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శంకర్ నేత్రాలయ చెన్నై కంటి ఆస్పత్రికి చెందిన కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన దాదాపు 200 మందికి పైగా ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. అన్ని రకాల అత్యాధునిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

వైద్య పరికరాలతో ఈనెల 10 నుంచి 14 వరకూ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి నాలుగురోజుల పాటు కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గజేంద్రవర్మ, డాక్టర్ శంకర్‌తో పాటూ 25 మంది వైద్య సిబ్బంది, ఏపీఆర్‌జేసీ రిటైర్డ్ పీడీ కుమార్ ప్రసాద్, పూర్వ విద్యార్థి అశ్వర్థ పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో సరుకుల సరఫరా

రొళ్ల: పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పూర్తి స్థాయిలో సరుకులు సరఫరా అవుతున్నాయని హెచ్‌ఎం హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం రత్నగిరి, ఎం.రాయాపురం తదితర సచివాలయం ఆవరణల్లో ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. రత్నగిరిలో ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం హరిప్రసాద్ మాట్లాడుతూ జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా రోజూ నాణ్యమైన భోజనాన్ని పిల్లలకు వడ్డిస్తున్నామన్నారు. సరుకుల సరఫరాలో ఏమైన సమస్యలు ఉన్నాయా అని సభ్యులు ఆరా తీశారు. ఎంపీటీసీలు జగదీష్‌బాబు, నాగరాజు, వీఆర్వో ప్రకాష్, వార్డెన్ హుస్సేన్, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న భక్తులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులు, గర్భిణులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సేవా కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రికి వచ్చిన వారికి అష్టావధాని ఆశావాది ప్రకాశరావు కుమార్తె శ్రీవల్లి సహకారంతో అన్నదానం చేశారు.

కరుణాకర్ సేవలు మరువలేనివి

పెనుకొండ: సీఐ కరుణాకర్ సేవలు మరువలేనివని డీఎస్పీ హుస్సేన్‌పీరా పేర్కొన్నారు. బదిలీ అయిన పెనుకొండ సీఐ కరుణాకర్‌కు శుక్రవారం రాత్రి సర్కిల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై సీఐ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ హుస్సేన్ పీరా

వంట ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

పావగడ: ప్రభుత్వ పాఠశాలల్లో వంట మనుషులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కర్ణాటక రాజ్య అక్షర దాసోహ ఉద్యోగుల సంఘం పదాధికారులు అక్షర దాసోహ కార్యాలయం ఎదుట శుక్రవారం పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షురాలు కెంచమ్మ మాట్లాడుతూ వంట వండి పిల్లలకు కడుపు నిండా అన్నం వడ్డించే వంట మనుషులు చాలీచాలని జీతాలతో కడుపు మాడ్చుకుని బతుకుతున్నారని వంట మనుషుల ఉద్యోగాలను పర్మినెంట్ చేసి ప్రభుత్వ వేతనాలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. అక్షర దాసోహ అధికారి శంకరనాయక్‌కు వినతిపత్రం అందించారు. ఆందోళనలో సంఘం ప్రధాన కార్యదర్శి కే నాగరత్న, సంచాలకులు మంజులమ్మ తదితర వంట మనుషులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

- మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఆరోగ్య భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కదిరేపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఎమ్మెల్యే శిబిరంలో వైద్యం ఎలా అందిస్తున్నారని రోగులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ స్థాయిలోనే అన్ని రకాల వ్యాధులకు డాక్టర్లు కార్పొరేట్ తరహాలో చికిత్సలు అందిస్తున్నారని ప్రజలు ఎమ్మెల్యేకు వివరించి హర్షం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టిహారం ప్రదర్శనను పరిశీలించారు. రోగులకు ఎమ్మెల్యే వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. ఆరోగ్యకరమైన సమాజంగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలోనే వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి పైసా ఖర్చు లేకుండా చికిత్సలు నిర్వహించి మందులను అందిస్తున్నారన్నారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందిస్తున్నామని తెలిపారు. డాక్టర్లు వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. సర్పంచ్ నర్సేగౌడు, ఎంపీటీసీ మూర్తి, రాష్ట్ర వక్కలిగకార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, తహసీల్దార్ ముర్షావలి, సీడీపీఓ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

అమరాపురం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం వి.అగ్రహారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని తహసీల్దార్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మనోహర్‌నాయక్, జయకుమార్, కీర్తి, అంబరీష్ రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. ఎమ్మెల్యే ప్రతి విభాగానికి వెళ్లి రోగులు, డాక్టర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. అనంతరం స్వయంగా రోగులను పరీక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ పాల్గొన్నారు.



మడకశిర మండలం కదిరేపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

గోరంట్ల: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం గోరంట్ల మూడో సచివాలయ పరిధిలో 'జగనన్న సురక్ష కార్యక్రమం' ఒకటో సచివాలయం వద్ద సర్పంచు సరోజబాయి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్త, వైద్య బృందం పాల్గొన్నారు.

రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

హిందూపురం టౌన్: ఆవోపా ఆధ్వర్యంలో సంతేబిదనూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ అనురాధ సహకారంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం, ఆరోగ్య మేళా నిర్వహిస్తున్నట్లు ఆవోపా తాలుకా అధ్యక్షుడు సతీష్, కార్యదర్శి శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. స్థానిక డీబీ కాలనీలోని అష్టలక్ష్మీ వాసవీ దేవాలయంలో ఈనెల 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ వైద్య శిబిరం ఉంటుందన్నారు. కీళ్ల వాతము, ఆయాసము, తలనొప్పి, పైల్స్, పక్షవాతం, చర్మ వ్యాధులకు మందులు అందించడం జరుగుతుందని తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

అమరాపురం: స్థానిక విశ్రాంతి భవనంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యాక్రమ నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు త్రిలోక్‌నాథ్ తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

అగళి: స్థానిక శనిమహత్మస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమ నిర్వహణపై సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు స్టుడియో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.